ప్రయోజనం శూన్యం

- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'
- చాలాచోట్ల రైతులే ఉండడం లేదు
- ఫొటోలు తీసుకోవడంతో సరి
- నిధులు పక్కదారి

రైతులకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోంది. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరగా నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమం తూతూమంత్రంగా జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పోట్లపూడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

తోటపల్లిగూడూరు: ప్రభుత్వం ప్రతి సంవత్సరం పొలం పిలుస్తోంది గ్రామసభలను నిర్వహిస్తోంది. ఇందులో పథకాలను వివరించడంతోపాటు క్షేత్ర సందర్శన చేసి రైతులకు సాగులో సూచనలు, సలహాలివ్వాలి. ఖరీఫ్, రబీ సాగుకు సంబంధించి సీజన్‌కు 32 రోజుల చొప్పున 64 రోజులపాటు సభలను ఏర్పాటు చేయాలి. వారంలో మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున సభలను పెట్టాలి. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు గాను అక్టోబర్ 15వ తేదీన పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభమైంది. 722 పంచాయతీలుండగా రోజుకు రెండుచోట్ల సభలు నిర్వహించాలి. 32 రోజుల లక్ష్యంలో ఇప్పటి వరకు పూర్తయింది 16 రోజులే. 1,184 గ్రామసభలను నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.

నిధులు పక్కదారి

పొలం పిలుస్తోంది సభల నిర్వహణకు రోజుకు రూ.2,500లను మండల వ్యవసాయాధికారులకు ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇందులో రూ.1,500లు అధికారుల రవాణా ఖర్చులకు, మరో రూ.1,000లు సభలకు విచ్చేసే రైతులకు స్నాక్స్, తాగునీటికి వినియోగించాలి. జిల్లాకు రూ.29.60 లక్షలను కేటాయించాల్సి ఉంది. సభల నిర్వహణకు ప్రభుత్వం ముందస్తుగా నిధులను విడుదల చేయదు. మండల వ్యవసాయాధికారులే ముందుగా ఖర్చు పెట్టుకుని ఆపై బిల్లులు అందించాలి. ఒక్కో మండల వ్యవసాయాధికారి రూ.80 వేలు సొంత డబ్బును ముందుగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఇక్కడే కొందరు నిబంధనలను తుంగలో తొక్కి సభలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధించి అధికశాతం సభల్లో పదిమంది కూడా రైతులు కనిపించడం లేదు. ముందస్తు సమాచారం లేకపోవడం, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో అన్నదాతల్లేకుండా కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొందరు అధికారులు కూలీలతో ఫొటోలు తీసుకుని ఉన్నతాధికారులకు పంపి మమ అనిపిస్తున్నారు.

ఏం చేస్తున్నారంటే..

గ్రామసభలకు ప్రభుత్వ వాహనాలను వినియోగించాల్సిన వ్యవసాయాధికారులు తమ సొంత వాహనాలను వినియోగిస్తూ రవాణా ఖర్చులను మిగిలించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. షామియానాలు, కుర్చీల ఖర్చు లేకుండా వీలైనంత వరకు పంచాయతీ కార్యాలయాల్లో, రచ్చబండల వద్దే కార్యక్రమాలు జరిపేస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తప్ప మిగిలిన రోజుల్లో మొక్కుబడిగా సాగుతోంది. ఎక్కువ శాతం స్థానిక నాయకులు, సర్పంచ్‌ల చేత ఖర్చు పెట్టిస్తున్నారని ప్రచారం ఉంది. వ్యవసాయ శాఖ నుంచి బడ్జెట్ విడుదలైన వెంటనే ఇష్టానుసారంగా బిల్లులు పెట్టుకుని జేబులు నింపుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పక్కాగా నిర్వహిస్తున్నాం

పొలం పిలుస్తోంది కార్యక్రమాలు పక్కాగానే నిర్వహిస్తున్నాం. ప్రతి సభ విజయంతంగా జరిపించేలా మండల వ్యవసాయాధికారులకు సూచనలు, సలహాలను అందిస్తున్నాం. సభల నిర్వహణకు సంబంధించి ఎనిమిది రోజులకు నిధులను విడుదల చేశారు. తూతూమంత్రంగా సభల జరిపే అధికారులను గుర్తించి చర్యలను తీసుకుంటాం.

– సత్యవాణి, వ్యవసాయ శాఖ జేడీ, నెల్లూరు



మొక్కుబడిగా క్షేత్ర సందర్శన (ఫైల్)

సమస్యలపై నిలదీత

- కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



సమస్యలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పలు సమస్యలపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని నిలదీశారు. దీంతో ఆమె కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా అక్రమ లేఅవుట్ల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. పారదర్శకంగా ఉంటేనే అనుమతులు ఇవ్వాలని చెప్పానని, అందుకే కమిషనర్‌ను లేఅవుట్‌కు పంపానని ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షాహుల్ కమిషనర్ వెళ్లి వచ్చిన తర్వాతే పనులు వేగవంతమైందని చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు యర్రబపల్లి శివకుమార్‌రెడ్డి, యానాదిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రమీలమ్మలు పలు అనధికార పనులపై ప్రశ్నించడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. నాగమాంబాపురం కాలువ నీటిపారుదల శాఖ కింద ఉందని, కొంచెం మాత్రమే పంచాయతీలో ఉందని, అయినప్పటికీ కాలువలో జేసీబీని దింపకుండానే పనిచేసినట్లుగా రూ.5 లక్షలు వృథా చేశారన్నారు. పాత గుడపల్లి కాలువ నుంచి పీర్ల కాలువ వరకు గతేడాది యంత్రాన్ని దింపి పని చేస్తే రూ.90 వేలతో పూర్తయిందని, అదే కాలువకు రూ.4.5 లక్షలు కేటాయించడం ఏమిటని శివకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. నగర పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలంటూ డిమాండ్ చేశారు. చెన్నూరు రోడ్డులో రూ.కోటి వ్యయంతో నిర్మించిన డ్రెయినేజీని రెండు వైపులా ఉన్న వ్యాపారస్తులు ఆక్రమించారని కౌన్సిలర్ మల్లికార్జున్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇంకా పలు అంశాలపై తీవ్ర చర్చ సాగడంతో ఎమ్మెల్యే ఇకపై ప్రతి విషయం కౌన్సిల్‌లో చర్చించిన తర్వాతే పనులు చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కేశవానందను అభినందిస్తున్న హెచ్‌ఎం

మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన మిటాత్మకూరు కేశవానంద్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. కేశవానంద్ మడమనూరు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా గతనెల 23, 24 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగిన కరాటే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. డిసెంబర్ 13, 14 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాలల్లో కేశవానంద్‌ను హెచ్‌ఎం రాధాకృష్ణ, టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ మురళీ మోహన్‌రావు, ఉపాధ్యాయుడు శివశంకర్, విద్యార్థి తండ్రి పొన్నూరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఇందుకూరుపేట: ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి



కొడవలూరు: పెయ్యలపాళెంలో..

పొదలకూరు: రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేసుకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బిరదవోలు, మరుపూరు గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి, మినుము, పెసర, శనగ, వేరుశనగ పంటలకు బీమా చేసుకునే సౌకర్యం ఉందన్నారు. వరి ఎకరాకు రూ.168, మినుము రూ.38, పెసర రూ.36, శనగ రూ.56, వేరుశనగ రూ.60 చెల్లించాల్సిందిగా సూచించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి నారుమడుల్లో ఉన్న నీటిని తొలగించాల్సిందిగా పేర్కొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు:** మండలంలోని కోడూరు – 1, కోడూరు – 2 పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లోని నేలల్లో భాస్వరం 92 శాతం కంటే ఎక్కువగా ఉన్నందున డీఏపీ ఎరువుల వాడకాన్ని ఆపాలన్నారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఎకరాకు రూ.168ల ప్రీమియం చెల్లించి పంటల బీమా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వీపీఏలు, శశి, దయానా తదితరులు పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని ఏఓ రఘునాథ్‌రెడ్డి కోరారు. మండలంలోని కొత్తూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాట్లు పూర్తయిన వరి పొలానికి మూడు దశలుగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. వీహెచ్‌ఏ మాధవయ్య పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు** : రైతులు పంట బీమా కోసం ప్రీమియం చెల్లించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని కమ్మపాళెం, పెయ్యలపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పెయ్యలపాళెంలో మాట్లాడుతూ ఈనెల 31లోపు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఏఏలు ఒ.సుజిత్, డి.నవీన్ కుమార్, శ్రావ్య, పంచాయతీ కార్యదర్శులు కల్యాణ్, రఫీ పాల్గొన్నారు.

⇨ **విడవలూరు** : పంట బీమాపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య తెలిపారు. ఊటుకూరు, పెద్దపాళెం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

⇨ **కోవూరు** : మండలంలోని పాటూరు, గుమ్మలదిబ్బ ప్రాంతాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. పంట బీమా చేయించుకోవాలన్నారు. ఏడీఏ సుజాత, ఏఓ ఇందిరావతి తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు



టీపీగూడూరు: సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



ఇందుకూరుపేట : కొత్తూరులో..

యూనివర్సిటీలో విద్యార్థులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో బుధవారం ఏరోసోల్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎమర్జింగ్ ట్రెండ్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ వాతావరణ మార్పులను విశ్లేషించడంలో ఏరోసోల్స్ కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు పరిశోధన విద్యార్థులకు కొత్త అవకాశాలను అందించడంలో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నిపుణులు వాతావరణ శాస్త్రం, మార్పులు, వాటి ప్రభావాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. ఇంటర్ నుంచి పీజీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 79896 13024, 95734 82179 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

ముత్తుకూరు: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు. 6వ తేదీ కృష్ణపట్నంలో, 7న ముత్తుకూరు, 10న నేలటూరు, 12న పైనాపురం, 17న పంటపాళెం, 19న ఆముదాలపాడు, 21న బ్రహ్మదేవి, 24న పిడతాపోలూరు, 26న మల్లూరు, 28న తాళ్లపూడి, 31న దొరువులపాళెం, జనవరి 2న నారికేళపల్లి, 4న వల్లూరు, 7న వల్లూరుకండ్రిగ, 8న పొట్టెంపాడు సచివాలయాల్లో సభలు జరుగుతాయని వెల్లడించారు.

- **కొడవలూరు:** మండల పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తి బుధవారం తెలిపారు. 6న నాయుడుపాళెం, 7న నార్తురాజుపాళెం, 10న ఉదయం మానేగుంటపాడు, మధ్యాహ్నం 2 ఆలూరుపాడు, 13న దామేగుంట, 17న ఉదయం గండవరం, మధ్యాహ్నం దగదర్తి మండలం గొట్లపాళెం, 19న ఉదయం బసవాయపాళెం, మధ్యాహ్నం గుండాలమ్మపాళెం, 20న రామన్నపాళెం, 24న కొత్తవంగల్లు, 26న తలమంచి, 28న బొడ్డువారిపాళెం, 31న యల్లాయపాళెం, జనవరి 2న కొడవలూరులో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

చికెన్ వ్యర్థాల తరలింపుపై దాడులు

కొడవలూరు: చికెన్ వ్యర్థాల అక్రమ తరలింపుపై కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి తన సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. మండలంలోని రామన్నపాళెం చేపల గుంతలకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

⇨ **కోవూరు:** కోవూరు ఆశ్రమం సెంటర్ వద్ద చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

పాఠశాలల్లో ఎన్‌ఏఎస్ పరీక్షలు



పొదలకూరు: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కొడవలూరు : రామాపురంలో..

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం జెడ్పీ హైస్కూల్, పట్టణంలోని అమరావతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం ఎన్‌ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) విద్యార్థులకు మాథ్స్, సైన్స్, సోషల్, ఇంగ్లిష్, బయాలజీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ – 2 ఎం.శోభనాద్రి మాట్లాడుతూ మండలంలో ఎన్‌ఏఎస్‌కు రెండు పాఠశాలను ఎంపిక చేశారన్నారు. బీఈడీ కాలేజ్ ఫీల్డ్ అబ్జర్వర్లు ఎం.వెంకటేష్, టి.సుధాకర్, సీబీఎస్‌ఈ స్కూల్ టీచర్లు వి.పల్లవి, జి.మాధుర్య, టీటీసీ పల్లెపాడు సీఆర్పీలు, అమరావతి, అమ్మవారిపాళెం పాఠశాలల హెచ్‌ఎంలు సురేష్, విజయకుమార్ పరీక్షలను నిర్వహించినట్టు వెల్లడించారు.

⇨ **కొడవలూరు** : మండలంలోని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు బుధవారం పరిశీలించారు. మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్లో ఆరో తరగతి, రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి ఎంపికయ్యాయి. నార్తురాజుపాళెంలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ జి.వసంతకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంపై విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పి.పూజిత, పరిశీలకురాలు డి.సుజన, సీఆర్‌ఎంటీ పులి రమేష్ ఉన్నారు.

⇨ స్థానిక గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల మూడో తరగతి విద్యార్థులకు నిర్వహించిన నాస్ పరీక్షను ఎంఈఓ ఎస్.అంకయ్య పరిశీలించారు. అన్ని రాష్ట్రాల్లోనూ నాస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ఎస్కే హైదర్‌అలీ, పరిశీలకుడు ఎస్.జాషువా, హెచ్‌ఎం సి.మాధవి, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్ ఉన్నారు.

వినియోగంలోకి వచ్చిన 'చెత్త' వాహనం

సాక్షి ఎఫెక్ట్..

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు మేజర్ పంచాయతీలో తడి, పొడిచెత్తను తరలించే వాహనం ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. ఈ వాహనం చెడిపోయి మూలపడింది. 'చెత్త వాహనానికి సుస్తీ' అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు వాహనానికి మరమ్మతులు చేయించారు. కొద్ది రోజులు ట్రాక్టర్ ద్వారా చెత్త తరలించినా పూర్తి స్థాయిలో సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది. తాజాగా రోడ్డెక్కిన ఈ వాహనం తడి, పొడిచెత్తను తరలించుకుపోతోంది.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న నిర్మల్‌కుమార్

విడవలూరు: మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని రెవరెండ్ డాక్టర్ ఎం.టైటస్ నిర్మల్‌కుమార్ అన్నారు. మండలంలోని వావిళ్ల ఈసీఐ ప్రార్థన మందిరంలో లైఫ్ చాలెంజ్ ఇండియా ద్వారా మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సంఘ కాపరి ఈ.మనోహర్, ఎం.విజయకుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ క్రిస్టఫర్, కల్యాణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



వెంకటాచలం: మండలంలోని పూడిపర్తిలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలోని కానుకలను బుధవారం లెక్కించారు. ఏడాదికి గానూ రూ.63,441లు ఉన్నట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీధర్‌నాయుడు తెలిపారు. రామతీర్థం దేవస్థానం ఈఓ రామకృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు.

ప్రసన్న ఆశీర్వాదం



కోవూరు: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు నలుబోలు సుబ్బారెడ్డి కుమారుడు సుకుమార్‌రెడ్డి, శిరీషరెడ్డిల వివాహం విజయవాడలో బుధవారం జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా నేవీ డే



విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేవీ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.సుజాత నౌకాదళం విశిష్టత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక యడవల్లి శ్రీనివాసశర్మకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎన్.మధు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డి.ఈశ్వరరావు, పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన ప్రభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ఎంఈఓలు వెంకటేశ్వరనాయక్, సునీల్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి నగర్‌లో సచివాలయాన్ని, బుచ్చి నగర పంచాయతీకి సంబంధించిన జేసీబీ, ఫాగింగ్ యంత్రాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం 117 మంది పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్స్‌తో పాటు శానిటేషన్ హెల్త్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మమ్మ, షాహుల్, హజరత్తయ్య, తాళ్ల వైష్ణవి, యరటపల్లి శివ పాల్గొన్నారు.


ఔత్సాహికులకు శిక్షణ

కోవూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణా తరగతులను బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు తరగతులు జరుగుతాయన్నారు.

రేపు కళా ఉత్సవ్

ఇందుకూరుపేట: జిల్లాస్థాయి కళా ఉత్సవ్‌లో భాగంగా మండలంలోని పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న బాలబాలికలు అర్హులన్నారు. సంగీతం, చిత్రలేఖనం, రంగస్థలం తదితర పోటీలుంటాయన్నారు. గతేడాది విజేతలుగా నిలిచిన వారు అనర్హులని తెలియజేశారు.

చదువుల పండగను జయప్రదం చేయండి



వసంతకుమారి

మనుబోలు: ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్న చదువుల పండగను జయప్రదం చేయాలని మనుబోలు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి కోరారు. బుధవారం ఆమె పాఠశాలలో మాట్లాడుతూ పిల్లల చదువు, బడి బాగు కోసం 7న మెగా పేరెంట్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అనంతరం వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.